
సాక్షి ఒడిశా

గురువారం । 5 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.32.675లు, బంగారం 300 మిల్లీగ్రాములు, వెండి 57 గ్రాములు 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సత్తాచాటిన కిషోర్ కుమార్

ఆసియా క్రీడలు పురుషుల జావెలిన్ త్రో పోటీలో ఒడిశా స్టార్ అథ్లెట్ కిషోర్ కుమార్ జెనా అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. ఈ పోటీలో 87.54 మీటర్ల త్రోతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

- 8లో



జయపురంలో జీరో టోలరెన్స్ డే

స్థానిక పట్టణ, సదర్ పోలీసులు ఆయా పోలీసుస్టేషన్ల ఎదురుగా జీరో టోలరెన్స్ డేను బుధవారం పాటించారు.

- 8లో

న్యూస్‌రీల్

45 లీటర్ల నాటుసారా పట్టివేత



నాటుసారాతో పట్టుబడిన నిందితుడు

జయపురం: బొరిగుమ్మ ఎక్సైజ్ సిబ్బంది 45 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారి విశ్వజిత్ పాణిగ్రహి తెలిపిన వివరాల మేరకు.. బొరిగుమ్మ సమితి పరిధిలోని లటిజొడి గ్రామంలో నాటుసారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని సమాచారం వచ్చింది. దీంతో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన దామోధర బిశాయి అనే వ్యక్తి తన మోటారు బైక్‌పై నాటుసారా తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి నాటుసారాతో పాటు మోటారు బైక్‌ను స్వాధీన పరుచుకున్నారు. దామోదర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గ్రామ సేవక్ సునీల్ మహంతి హత్య



సునీల్ మహంతి మృతదేహం

బరంపురం: గంజాం జిల్లాలోని కోదలా ధర్మగడ గ్రామంలో కొద్ది రోజుల క్రితం గ్యాంగ్‌స్టర్ సునీల్ నాహక్ హత్యకి గురైన ఘటన మరువక ముందే, జిల్లాలోని బెగునియాపడా బ్లాక్‌లో గుర్తు తెలియని దుండగుల చేతిలో గ్రామ సేవక్ సునీల్ మహంతి హత్య గురైన ఘటన సంచలనం రేపింది. గ్రామస్తుల అందించిన సమాచారంతో బెగునియాపడా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. సునీల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

అధ్యక్షురాలిగా జమునా నాయక్



బరంపురం: గంజాం జిల్లాలోని దిగపండి బ్లాక్ అధ్యక్షురాలిగా జమునా నాయక్ ఎన్నికయ్యారు. దిగపండి బ్లాక్ అధ్యక్ష ఎన్నికలు బుధవారం జరిగాయి. అధ్యక్ష పదవికి 13 మంది అభ్యర్థులు పోటీచేయగా, బోమ్మకా సమితి సభ్యురాలు జమునా నాయక్ విజయం సాధించారు. ఈ సందర్భంగా దిగపండి బ్లాక్ కార్యాలయంలో ఆమెకు మద్దతుదారులు అభినందనలు తెలియజేశారు.

దడ పుట్టిస్తున్న స్క్రబ్ టైఫస్

భువనేశ్వర్: రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాప్తి దడ పుట్టిస్తోంది. 2-3 జిల్లాలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ వ్యాపించింది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ, నగర ప్రాంతాల్లోనూ విస్తరించిందని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాప్తి, తీవ్రత సమీక్షించేందుకు కేంద్ర బృందం పర్యటించింది. ఈ బృందం బర్‌గడ్, ఝార్సుగుడ, సంబల్‌పూర్, సుందర్‌గడ్, బొలంగీర్ జిల్లాలు మరియు బుర్లా మెడికల్ సెంటర్ సందర్శించింది. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ, వ్యాప్తి నియంత్రణ చర్యలను ఈ బృందం అభినందించింది. 2019 సంవత్సరం నుంచి రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం పేర్కొంది. నిర్ధారణ పరీక్షలు మరియు ముందస్తు గుర్తింపు వ్యవస్థ మరింత పటిష్ట పరిచేందుకు బృందం మౌఖికంగా సూచించింది. ఈ మేరకు రాత పూర్వకంగా ఉత్తర్వులు జారీ కావడంతో తదుపరి చర్యలు చేపడతామని డాక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ బృందం కూడా బర్‌గడ్ మరియు సుందర్‌గడ్‌లకు వెళ్లి స్క్రబ్ టైఫస్ పరిస్థితి సమీక్షించింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎలీషాకు బదులు ర్యాపిడ్ టెస్ట్ చేస్తున్నారు. ఎలీషా మాత్రమే స్క్రబ్ టైఫస్ నిర్ధారణకు సరైన పరీక్షగా పరిగణించబడుతుందని పేర్కొంది.

సాగులో... సిరుల సేంద్రీయం



వంకాయలను గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

- వినూత్న సాగులో రాణిస్తున్న శ్రీనివాస్
- అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శం
- పలువురికి ఉపాధి కల్పన



సేకరించిన నాణ్యమైన వంకాయలు



కూరగాయలను తీసుకొస్తున్న ఆదివాసీ యువతులు



రాయగడ:

తెల్లవారితే చాలు ధనవంతులు నుంచి పేద, మధ్య తరగతి వరకు ప్రతి ఒక్కరూ ఆలోచించేది ఈరోజు ఇంట్లో ఏం కూర వండాలోనని. నిత్యం ప్రతి ఇంటికీ అవసరం కూరగాయలు. తాజా కూరగాయలు కావాలని, సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలు అయితే మరీ మంచిదని సగటు ఇల్లాలు కోరుకుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని స్థానిక జేకేపూర్‌కు చెందిన రైతు దూడల శ్రీనివాస్ సేంద్రీయ సాగుతో అధిక దిగుబడులు సాధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు. ఒకప్పుడు బరంపురం, కొరాపుట్, కుందిలి ప్రాంతాల నుంచి, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు చెందిన పార్వతీపురం, బొబ్బిలి నుంచి రాయగడకు కూరగాయలు దిగుమతి అవుతుండేవి. ఇక్కడి వ్యాపారస్తులు కూడా ఆయా ప్రాంతాలపైనే ఆధారపడుతూ వ్యాపారాలు కొనసాగిస్తుండేవారు.

నాలుగు ఎకరాల్లో ప్రారంభించి...

ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుబడి అవుతుండడంతో వస్తున్న సమస్యలను దృష్టిలో పెట్టుకున్న రైతు శ్రీనివాస్ ప్రథమంగా కొలనారలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఉన్నటువంటి తన నాలుగు ఎకరాల స్థలంలో సేంద్రీయ పద్ధతిలో జామ, మామిడి, మునగ తదితర పంటలు సాగు చేశాడు. వీటిలో అత్యధిక దిగుబడులను సాధించి అందరి మెప్పు పొందాడు. 2019లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరించిన అరుణ్ సాహు స్వయంగా శ్రీనివాస్ సాగుచేసే ప్రాంతానికి వెళ్లి సాగుతీరును పరిశీలించి ప్రశంసించారు. ఇటువంటి రైతులు ఎంతోమందికి ఆదర్శవంతులవ్వాలని ఆకాంక్షించారు. కాగా సేంద్రీయ పద్ధతిలో సాగుకు ముగ్ధుడైన మంత్రి సాగు విస్తీర్ణం మరింత పెంచమని అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రోత్సాహంతో జిల్లా కేంద్రానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలోని కొలనార సమితి సూరి పంచాయతీకి చెందిన తోటగుడ ప్రాంతంలో తనకు ఉన్న స్థలంతో పాటు కౌలుకు తీసుకున్న మరికొంత స్థలంతో కలిపి మొత్తం 50 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలతో పాటు వాణిజ్య పంటలైన జొన్న, పత్తి, ఫామ్ ఆయిల్, కందులు తదితరమైనవి సాగు చేశాడు. ముఖ్యంగా కూరగాయల పంటలపై దృష్టి కేంద్రీకరించిన ఆయన అందుకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంతో సాగు చేస్తున్న వంగ, దోస, చిక్కుడు, సొరకాయ, బీన్స్, కాకర వంటివి అధిక దిగుబడి ఇస్తుండడంతో లాభాల బాటలో పయనిస్తున్నాడు.

రెండింతల దిగుబడి

తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులు వస్తున్న వంగ సాగులో శ్రీనివాస్ గణనీయ లాభాలు ఆర్జిస్తున్నారు. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో వంగ సాగువుతోంది. మరో పది ఎకరాల్లో బీన్స్, ఐదు ఎకరాల్లో చిక్కుడు, మిగతా స్థలంలో కాకర, దోస, సొరకాయ పంటలను సాగు చేస్తున్నారు. గత ఆగస్టు నెలలో ప్రారంభించిన ఈ సాగు ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం పంట చేతికి వస్తుంది. ప్రతీవారం రోజులకు గాను సుమారు రెండు టన్నుల వంకాయలు దిగుబడి అవుతున్నాయి. అదేవిధంగా చెరో టన్ను లెక్కలో మిగతా కూరగాయలు దిగుబడి అవుతున్నాయి. దీంతో వ్యాపారులే సరాసరి తమ పంట పొలంకు వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తున్నట్లు తెలియజేశారు. నాణ్యమైన కూరగాయలు అందుబాటులోకి రావడంతో రాయగడకు చెందిన వ్యాపారస్తులతో పాటు ఇటు కొరాపుట్, మల్కన్‌గిరి నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ ఖరీదు చేసి తీసుకెళ్తున్నారు. అదేవిధంగా భువనేశ్వర్, కటక్ వంటి ప్రాంతాలకు ప్రతీవారం అత్యధికంగా కూరగాయలు ఎగుమతి అవుతున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తోంది. వారిని వివిధ పథకాల ద్వారా అదుకుంటోంది. సబ్సిడీల రూపంలో సకాలంలో రైతులకు ఆర్థికంగా ఆదుకుంటూ ఉండడంతో తమ రంగంలో రాణించగలుగుతున్నారు. శ్రీనివాస్ తమ పంట పొలాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలకు సాగునీరు అందిస్తుండడంతో మంచి దిగుబడులు సాధించగలుగుతున్నాడు.



చిక్కుడు కాయలు



ఏపుగా కాసిన సొరకాయలు



ఎగుమతులకు సిద్ధం చేసిన వంకాయలు

కూరగాయలకు మంచి గిరాకీ



ఈ ప్రాంతంలో కూరగాయలకు మంచి గిరాకీ ఉంది. దానికి తోడు సేంద్రీయ ఎరువులతో పండించే కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో సాగుపై ఆసక్తి కనబరిచాను. రైతు బిడ్డగా వ్యవసాయంపై అవగాహన ఉండడంతో ఆధునిక వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తున్నాను. తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి వచ్చే సాగుపై ఇతర రైతులు కూడా ఆసక్తి కనబరచగలిగితే ఆర్థికంగా అభివృద్ధి బాటలో పయనించవచ్చు. కూరగాయల రైతులకు ప్రభుత్వం కూడా మంచి ప్రోత్సాహం అందిస్తోంది. వ్యవసాయంలో లాభాలతో పాటు ఎంతోమందికి ఉపాధిని కూడా కల్పించవచ్చు.

– దూడల శ్రీనివాస్‌రావు, రైతు

పనులు దొరుకుతున్నాయి



ఒకప్పుడు కూలి పనుల కోసం ఊరూరా తిరిగే వాళ్లం. రోజుల తరబడి అక్కడే ఉండే వాళ్లం. అయితే ప్రస్తుతం మా గ్రామానికి దగ్గరలోనే రైతు శ్రీనివాస్ కూరగాయల సాగు చేపట్టడంతో పనులు లభిస్తున్నాయి. నెలకు సుమారు రూ.7 వేల నుంచి రూ.8 వేలు సంపాదించుకోగలుగుతున్నాం. అదేవిధంగా కూరగాయల సాగులో మెలకువలు నేర్చుకోగలుగుతున్నాం. కుటుంబీకులకు దగ్గరే ఉంటూ ఆనందంగా గడుపుతున్నాం.

– నవీన్ కొండగిరి, వ్యసాయ కూలి

ఆనందంగా ఉంది



మా గ్రామానికి దగ్గరలోనే వ్యవసాయ పనులు లభిస్తుండడంతో వలస పోవాల్సిన అవసరం లేదు. అందరం కలిసి ఆనందంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నాం. కష్టానికి తగ్గ ఫలితం లభిస్తోంది. అందుకే ఆనందంగా ఉంది. మా కష్టాన్ని గమనించిన యజమాని అదనంగా కూరగాయలు కూడా ఇస్తుంటారు.

– ధను హిమిరిక, ఆదివాసీ యువకుడు, కురుంపేట

ప్యాకింగ్ చేస్తుంటాం



ప్రతిరోజూ పొలంలో పండిన పంటలను తీసుకొచ్చిన అనంతరం వాటిని గ్రేడింగ్ చేస్తుంటాం. 20 కిలోల చొప్పున కూరగాయలను విడివిడిగా ప్యాకింగ్ చేస్తుంటాం. ఈ పనుల్లో ఎక్కువ మంది మహిళలు పాల్గొంటున్నాం. అనంతరం వాటిని ఎగుమతుల కోసం తరలిస్తుంటాం. ఇక్కడ ఎంతోమంది ఆదివాసీ మహిళలు కూలి పనులు చేసుకుంటూ ఉపాధిని పొందుతున్నాం.

– వడకా అనిత, ఆదివాసీ మహిళ


నేడు తాత్కాలికంగా దర్శనం నిలిపివేత

భువనేశ్వర్: శ్రీమందిరం రత్న వేదికపై నిత్య దర్శనం కల్పిస్తున్న శ్రీ జగన్నాథుని దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆలయం అధికారులు తెలిపారు. రత్న వేదికపై మూల విరాటులకు ముఖ అలంకరణ (బొనాకొ లగ్గి) అశ్వని కృష్ణపక్షం షష్టి తిథి పురస్కరించుకుని గురువారం చేపడతారు. ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాధారణ భక్తులకు శ్రీమందిరంలోనికి ప్రవేశం నివారిస్తారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవధిలో భక్తులు, యాత్రికులకు స్వామి దర్శనం లభించదు. అలంకరణ అనంతరం దర్శనం యథాతథంగా కొనసాగుతుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాదంలో మృతి చెందిన ధొనియా కౌసల్య



బోల్తాపడిన ట్రాక్టర్

రాయగడ: ఎదురెదురుగా వస్తున్న బైకు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై వస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లాలోని తెరువలి పంచాయతీ కెలిగుడ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒడుగుడ గ్రామానికి చెందిన ధొనియా కౌసల్య తెరువలి గ్రామానికి వెళ్లి పనులు ముగించుకొని రాత్రి 11 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో కెలిగుడ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఒక ట్రాక్టర్ అదుపుతప్పి ఆ బైక్‌ను ఢీకొంది. దీంతో సంఘటన స్థలంలోనే ధొనియా మృతి చెందాడు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

అర్ధరాత్రి ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్ పర్యటన



చీకటిలో మనబార్ కొండలపైకి వెళ్తున్న అధికారులు

కొరాపుట్: ఈస్ట్‌కోస్ట్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ కొరాపుట్‌లో మంగళవారం అర్ధరాత్రి పర్యటించారు. దీంతో అకస్మాత్తుగా రైల్వే ఉన్నతాధికారులు కొరాపుట్ చేరుకున్నారు. అనంతరం గత నెల 24వ తేదీన కొండచరియలు చొచ్చుకువచ్చిన జరతి-మనబార్ రైల్వేస్టేషన్ల ప్రాంతానికి వెళ్లారు. వర్షం పడుతున్నప్పటికీ జనరల్ మేనేజర్ పర్యటన ముందుకు సాగింది. చిమ్మచీకట్లో సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండ మీదకి అధికారులు బృందం తరలివెళ్లింది. అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులు పర్యవేక్షించారు. మరో రెండు రోజుల్లో రైల్వే ట్రాక్ పునరుద్ధరణ చేయాలని మనోజ్ శర్మ ఆదేశించారు. ఈ ప్రమాదం వలన వాల్తేర్ డివిజన్‌కి కోట్లాది రూపాయుల నష్టం ఏర్పడింది. ఇప్పటికే సుమారు 13 రోజులుగా ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం సైతం తక్షణ చర్యలకు ఆదేశించింది. జనరల్ మేనేజర్ వెంట వాల్తేర్ డివిజల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ కార్యాలయం ముట్టడి



విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ విద్యుత్ విభాగ కార్యాలయాన్ని బొయిపరిగుడ సమితి దొరాగుడ గ్రామ పంచాయతీ గతనగుడ గ్రామానికి చెందిన మహిళలు బుధవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 రోజులుగా గ్రామానికి విద్యుత్ సరఫరా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులకు చెబుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల కుండపోత వర్షాలు పడడంతో అంధకారంలో చిన్న పిల్లలతో ఇబ్బందులు పడినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడం వలన తమ పిల్లల చదువులు సాగడం లేదని ఆరోపించారు. గ్రామమంతా చీకటిగా మారడంతో పాముల బెడద పెరిగిందని, దీంతో బిక్కుమిక్కుమంటూ గడుపుతున్నామని వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

11 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



జరడా పోలీసులకు చిక్కిన నలుగురు పేకాటరాయుళ్లు



పెద్ద బజార్ పోలీసులకు చిక్కిన వ్యక్తులు

బరంపురం: గంజాం జిల్లాలో కొద్ది రోజులుగా రహస్యంగా నడుస్తున్న రెండు వేర్వేరు జూదం అడ్డాలపై పోలీసులు దాడులు చేసి 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్‌డీపీవో పాతి తెలిపిన వివరాల మేరకు.. పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి శ్రీరామ్‌నగర్ 7వ లైన్‌లో ఉన్నటువంటి ఇంటిలో రహస్యంగా కొద్ది రోజుల నుంచి జూదం అడ్డా నడుస్తోంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.19,200 నగదు, 7 సెల్‌ఫోన్లు మరియు రెండు పేకముక్కల కట్టలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జరడా పోలీసుస్టేషన్ పరిధి సింహాలి గ్రామంలోని మామిడి తోటలో రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాలపై పోలీసులు దాడిచేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.14,330 నగదు, 3 సెల్‌ఫోన్లు మరియు ఒక పేకముక్కల కట్టను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

బ్లాక్‌లో యూరియా అమ్మకాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఖరీఫ్ పంటకు ఉపయోగించే యూరియా బస్తాలు మార్కెట్‌లో కొందరు వ్యాపారులు బ్లాకులో అధిక ధరలకు అమ్ముతున్నందున రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న యూరియా బస్తాను సబ్సిడీ ధరకు గత నెలలో రూ.216 లకు కెరండీ, ఉప్పలాడ, రాయఘడ, కాశీనగర్‌లలో రైతులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా దొరక్కపోవడంతో పర్లాకిమిడిలో పలు ప్రైవేటు వ్యక్తులు రూ. 600 అమ్ముతున్నట్లు బీజేపీ కృషక్ సంఘ్ నాయకుడు ప్రశాంత్ కుమార్ పాలో, కెరండికి చెందిన రాజేంద్ర జెన్నా, యడ్ల రాములు, ఆకుల లక్ష్మీనారాయణ ఆరోపించారు. దీనిపై అధికారులకు రైతు సంఘం ఫిర్యాదు చేసినా సివిల్ సప్లయ్, వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి యూరియా ధరలు నియంత్రించకుంటే జిల్లా కృషక్ నేతలు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చీఫ్ విప్‌గా మానస్ మంగరాజ్ నియామకం


మానస్ రంజన్ మంగరాజ్

భువనేశ్వర్: రాజ్యసభలో బిజూ జనతాదళ్ (బీజేడీ) ఆ పార్టీ రాజ్యసభ చీఫ్ విప్‌గా మానస్ రంజన్ మంగరాజ్‌ను నియమించింది. ఈ మేరకు పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలవుతాయని స్పష్టం చేయడం విశేషం. ఇంతవరకు ఈ హోదాలో పార్టీకి చెందిన మహిళా అభ్యర్థి సులతా దేవ్ బాధ్యతలు నిర్వహించేవారు. సీనియర్ బీజేడీ అభ్యర్థులు సులతా దేవ్ మరియు సస్మిత్ పాత్రోతో కలిసి మానస్ రంజన్ మంగరాజ్ 2022 సంవత్సరం జూలై నెలలో రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి మీడియా మరియు ప్రజా సంబంధాల సలహాదారుడు మరియు చిలికా నియోజకవర్గానికి చెందిన నాయకుడు.

కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, అధికారులు చొరవ తీసుకోవాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. ఉత్సవాల నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే ఉత్సవాలకు సుమారు 6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనికి అనుగుణంగా బందోబస్తు, ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజ్, సర్పంచ్‌లు కాల్ల సంజీవరావు, ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఈఓ వి.రాధాకృష్ణ, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్‌ఐ మహమ్మద్ అలీ, కల్లి లక్ష్మణరెడ్డి, కల్లి నాగయ్యరెడ్డి పాల్గొన్నారు.

పెదపాడు గురుకులానికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పెదపాడు పరిధిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాల/పాఠశాలకు దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డాక్టర్ దానేటి శ్రీధర్ బుధవారం రూ.లక్ష విరాళం అందించారు. ఈ మొత్తంతో విద్యార్థుల సౌకర్యార్థం ఇన్వర్టర్లు కొనుగోలు చేయాలని ప్రిన్సిపాల్ జ్యోతికి సూచించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి చేరుకున్నానని, ప్రతిఒక్కరూ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఓ బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర హార్టికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థిని జీవిరెడ్డి నాగ వరహా రమాదేవి నిరీష బీఎస్సీ హార్టికల్చర్ హానర్స్ డిగ్రీ ప్రవేశ పరీక్ష హార్టిసెట్–2023లో సత్తాచాటింది. 100 మార్కులకు గాను 82.50 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించింది. ప్రణాళికాబద్ధంగా చదవటం వల్ల ఈ ర్యాంకు సాధ్యమైనట్లు విద్యార్థిని తెలిపింది. ప్రిన్సిపాల్ జి.హర్షవర్దన్, కళాశాల యాజమాన్య సభ్యులు విద్యార్థినిని బుధవారం అభినందించారు.

విద్యా ప్రమాణాలపై నాక్‌బృందం ఆరా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. నాక్ కమిటీ చైర్‌పర్సన్ టి.సి.తరనాథ్, కోఆర్డినేటర్ నాగేంద్ర అంబేద్కర్ సోలే, సభ్యురాలు వి.సుజాత తదితరులకు ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ నేతృత్వంలో విద్యార్థులు సాదరంగా స్వాగతం పలికారు. డిగ్రీ గ్రూపుల వివరాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, సాంకేతిక విద్య తదితర అంశాలను బృంద సభ్యులు సుదీర్ఘంగా పరిశీలించారు. అనంతరం పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెండు రోజుల పాటు నాక్ బృందం పరిశీలన చేస్తుందని ప్రిన్సిపాల్ గోవిందమ్మ తెలిపారు.

సత్తాచాటిన కిషోర్ కుమార్

- ఆసియా క్రీడల్లో రజతం కైవసం


కిషోర్ కుమార్ జెనా

భువనేశ్వర్: ఆసియా క్రీడలు పురుషుల జావెలిన్ త్రో పోటీలో ఒడిశా స్టార్ అథ్లెట్ కిషోర్ కుమార్ జెనా అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. ఈ పోటీలో 87.54 మీటర్ల త్రోతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ అద్భుత విజయంతో పారిస్ 2024 ఒలింపిక్స్‌లో కూడా స్థానం దక్కించుకున్నాడు. భారత ప్రధాని తదితర ప్రముఖులు, ఉన్నతాధికారులు రజత పతక విజేత కిషోర్ కుమార్ జెనాకు ప్రత్యేకంగా అభినందించారు.

జాతికి గర్వ కారణం: ప్రధాన మంత్రి

ఆసియా క్రీడల్లో పురుషుల జావెలిన్‌లో కిషోర్ కుమార్ జెనా సాధించిన విజయం చెప్పుకోదగ్గది. ఆయన విజయం భారతదేశానికి రజత పతకాన్ని సాధించింది. ఈవెంట్‌లో ఈ అద్భుతమైన రజతాన్ని గెలుచుకున్నందుకు కిషోర్‌కు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

ఒడిశా క్రీడలకు చారిత్రాత్మక రోజు: వినీల్ కృష్ణ

కిషోర్ కుమార్ జెనా జావెలిన్ త్రోలో 87.54 మీటర్ల వ్యక్తిగత బెస్ట్‌తో రజత పతకాన్ని గెలుచుకున్నాడు మరియు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఈ విజయం రాష్ట్ర క్రీడా రంగంలో చారిత్రాత్మక రోజుగా మిగిలిపోతుందని రాష్ట్ర క్రీడలు మరియు యువజన వ్యవహారాల కార్యదర్శి వినీల్ కృష్ణ అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వం నగదు పురస్కారం

చైనాలోని హాంగ్‌జౌలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించిన ఒడిశాకు చెందిన జావెలిన్ స్టార్ అథ్లెట్ కిషోర్ కుమార్ జెనాకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ.1.5 కోట్ల నగదు బహుమతిని ప్రకటించారు. వ్యక్తిగత అత్యుత్తమ 87.54 మీటర్ల వర్గంలో విజయంతో కిషోర్ పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించాడు. ఈ రజతంతో కిషోర్ రాష్ట్రానికి, దేశానికి చారిత్రాత్మక ఘట్టాన్ని సృష్టించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చి, దేశ క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ అతని అద్భుతమైన ప్రదర్శన, అతని పట్టుదల మరియు సంకల్పానికి గుర్తింపుగా ఈ విజయం లభించింది. ఆసియా క్రీడల్లో విజయం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించినందుకు నేను అతనికి అభినందనలు తెలియజేస్తున్నాను. కిషోర్ విజయం వ్యక్తిగత శ్రేష్ఠతను ప్రతిబింబించడమే కాకుండా దేశవ్యాప్తంగా వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. వచ్చే ఏడాది ఒలింపిక్స్‌కు సన్నద్ధమవుతున్న కిషోర్ అన్ని విధాలా సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

జస్టిస్ సుభాసిస్ తలపాత్ర పదవీ విరమణ


వీడ్కోలు సభలో మాట్లాడుతున్న చీఫ్ జస్టిస్ సుభాసిస్ తలపాత్ర

భువనేశ్వర్: ఒడిశా హైకోర్టు 33వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభాసిస్ తలపాత్ర పదవీ విరమణ పరస్కరించుకుని రాష్ట్ర హైకోర్టు వర్గాలు బుధవారం ఆయనకు వీడ్కోలు పలికాయి. ప్రధాన న్యాయమూర్తిగా కేవలం 56 రోజుల పాటు కొనసాగిన అతి తక్కువ పదవీకాలాల్లో ఆయన ఒకరుగా నిలిచారు. పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తి వీడ్కోలు సభకు హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, అడ్వకేట్ జనరల్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు న్యాయవాదులంతా హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మనం కాస్త ఆలోచించాలని జస్టిస్ సుభాసిస్ తలపాత్ర అన్నారు. ఈ ప్రయత్నంలో న్యాయవాదుల జ్ఞానం ద్వారా న్యాయమూర్తులు తీర్పుల నిర్వహణ ముడిపడి ఉంటుందన్నారు. మీ (న్యాయవాదులు) జ్ఞానం, మా (న్యాయమూర్తులు) ఆత్మలు మరియు తార్కిక ప్రక్రియలోకి బదిలీ చేయబడతాయి. ఒత్తిడి చేయబడిన సమస్యలకు చట్టపరమైన పరిష్కారాలను న్యాయమూర్తుల కనుగొంటారు అన్నారు. న్యాయమూర్తులు రాజులుగా వ్యవహరించవద్దని కోరారు. ప్రజాస్వామ్య సూత్రాలను స్వీకరించాలని న్యాయమూర్తులందరికీ పిలుపునిచ్చారు.

పట్టాలు తప్పిన గూడ్సు రైలు

- పలు రైళ్లు రద్దు

భువనేశ్వర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బాలాసోర్ మరియు హల్దీపడా రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. ముందస్తు పునరుద్ధరణకు సంబంధించిన నిర్వహణ పనుల దృష్ట్యా సంబంధిత యంత్రాంగం చర్యలు చేపట్టింది. అదే సమయంలో ఇసుక, ఇతర ప్యాకింగ్ సామగ్రితో వెళ్లిన వ్యాగన్లు (బీసీఎన్) పట్టాలు తప్పాయి. దీని ప్రభావంతో ఈ మార్గంలో కొన్ని రైలు సేవలు రద్దు చేసి మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. పూరీ రైల్వే స్టేషను నుంచి బుధవారం బయల్దేరే 18477 పూరీ - యోగ్ నగరి రిషికేశ్ ఎక్స్‌ప్రెస్ రైలుని దారి మళ్లించి సురక్షితంగా గమ్యం చేర్చే ఏర్పాట్లు చేశారు. సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ రోడ్, ఈబ్ స్టేషన్‌ల మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుందని తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది.

రద్దయిన రైలు సేవలు	
రైలు	తేదీ
08032/08031 భద్రక్-బాలాసోర్-భద్రక్ మెమూ స్పెషల్	04.10.2023
08064 భద్రక్-ఖరగ్‌పూర్ మెమూ స్పెషల్	04.10.2023
18037 ఖరగ్‌పూర్-జాజ్‌పూర్ కియోంజర్ రోడ్ ఎక్స్‌ప్రెస్	04.10.2023
18043 హౌరా-భద్రక్ ఎక్స్‌ప్రెస్	04.10.2023
12277 హౌరా-పూరీ శతాబ్ది ఎక్స్‌ప్రెస్	04.10.2023
18409 షాలిమార్-పూరి శ్రీ జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్	04.10.2023
18410 పూరీ-షాలిమార్ శ్రీ జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్	04.10.2023
12841 షాలిమార్-ఎమ్‌జీఆర్ చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్	04.10.2023
22831 హౌరా – శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్	04.10.2023
22835 షాలిమార్-పూరి ఎక్స్‌ప్రెస్	04.10.2023
18022 ఖుర్దా రోడ్-ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్	04.10.2023
12892 పూరీ-బంగ్రిపోసి ఎక్స్‌ప్రెస్	04.10.2023
20831 షాలిమార్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్	04.10.2023
12837 హౌరా-పూరీ ఎక్స్‌ప్రెస్	04.10.2023
12278 పూరీ-హౌరా శతాబ్ది ఎక్స్‌ప్రెస్	05.10.2023
18038 జాజ్‌పూర్ కియోంజర్ రోడ్-ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్	05.10.2023
18044 భద్రక్-హౌరా ఎక్స్‌ప్రెస్	05.10.2023
08063 ఖరగ్‌పూర్-భద్రక్ స్పెషల్	05.10.2023

విద్యార్థిని అనుమానాస్పద మృతిపై ఫిర్యాదు


ఫిర్యాదు చేయడానికి వెళ్తున్న బిజయకుమార్ పట్నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో బెత్తగుడ జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని సౌదామినీ రైయితో అనుమానస్పద మృతిపై ఆమె తల్లి సుజ్ఞాని గోమాంగో మంగళవారం భువనేశ్వర్‌లోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు బిజయకుమార్ పట్నాయక్ నేతృత్వంలో సౌదామిని రైతో తల్లి సుజ్ఞాని గొమాంగో మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదును బుధవారం అందజేశారు. ఘటన జరిగి ఐదు నెలలు గడిచినా రాష్ట్ర క్రైమ్ బ్రాంచి నివేదికను అందించలేకపోయిందని, పోలీసులు నిందితులను అరెస్టు చేయలేకపోయారని సౌదామిని రైతో తల్లి విలేకరుల వద్ద ఆరోపించారు. తన కూతురికి న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు.

గ్రామీణ డాక్ సేవకుల ధర్నా


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్ సాహు

జయపురం: తమ డిమాండ్ల సాధన కోసం అఖిల భారత గ్రామీణ డాక్ సేవక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జయపురంలో గ్రామీణ డాక్ సేవకులు బుధవారం ధర్నా నిర్వహించారు. జాతీయ గ్రామీణ డాక్ సేవక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ సాహు నేతృత్వంలో జయపురం ప్రధాన తపాలా కార్యాలయం ముంగిట ధర్నా నిర్వహించి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సాహు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్ సేవకులను అందరి ఉద్యోగుల మాదిరిగా పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు డాక్ సేవకులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే గ్రామీణ డాక్ సేవకులకు నాలుగు గంటల పని అని చెబుతూ, 8 గంటలకన్నా ఎక్కువ సమయం పనిచేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమలేశ చంద్ర కమిటీ రిపోర్టు అమలు చేయడంతో పాటు 12 ఏళ్ల పనిచేసిన వారికి రెండు ఇంక్రిమెంట్లు, రూ.5 లక్షల గ్రూపు బీమా, రిటైర్ అయినవారికి రూ.5 లక్షల గ్రాడ్యుటీ, 180 రోజుల సెలవులు, ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఉచిత వైద్య సేవలు సమకూర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లు అంగీకరించకుంటే నిరవధిక ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జయపురం సిటీ కో–ఆర్డినేషన్ కమిటీ సాధారణ కార్యదర్శి ప్రమోద్ కుమార్ మహంతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జుదిష్టర్ రాళో, దేవరాజ్ దాస్, శిశిర గంతాయిత్, ఆర్.గోపాలరావు, ఉపేంద్ర ఖొర, అభి దొర తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో జీరో టోలరెన్స్ డే


సదర్ పోలీసుస్టేషన్ ఎదుట వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట విధులు నిర్వహిస్తున్న పోలీసు

జయపురం: స్థానిక పట్టణ, సదర్ పోలీసులు ఆయా పోలీసుస్టేషన్ల ఎదురుగా జీరో టోలరెన్స్ డేను బుధవారం పాటించారు. ఈ సందర్భంగా 4 గంటల్లో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన 110 మంది వాహన చోదకుల నుంచి రూ.1,18,000 అపరాధ రుసుము వసూలు చేశారు. వివిధ కారణాల వలన 24 మంది డ్రైవర్ల లైసెన్స్‌లు రద్దు చేయాలని సూచించినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండిలు వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయా వాహనాల యజమానులకు ఫోను ద్వారా మెసేజ్ చేయడం జరిగిందన్నారు. సదర్ ఎస్‌ఐ గౌరవ రంజన్ దాస్, ఏఎస్‌ఐ బసంతీ నాయిక్, పంకజినీ శబర, కామాక్ష ప్రసాద్ బిశాయి, సుశాంత కుమార్ దళపతి, ప్రియదర్శి గొమాంగో, పోలీసు సిబ్బంది, పట్టణ ఏఎస్‌ఐ బిష్టు మడకాని, అనీల్‌కుమార్ నాయిక్, ఓఎస్‌ఏపీ జవానులు తనిఖీల్లో పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సీసీడీ వర్క్‌షాపు


వేదికపై కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఒకరోజు వర్క్‌షాపును సెంటర్ ఫర్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ (సీసీడీ) సంస్థ మరియు సైట్ సేవర్స్ ఇండియా సౌజన్యంతో నిర్వహించారు. జిల్లాలో దివ్యాంగులకు ఆకలిదప్పులు లేమి, మంచి ఆరోగ్యం, విద్య, 5టీ పథకాలు చేరేవిధంగా ప్రభుత్వ అధికారులు కృషి చేయాలన్నారు. తద్వారా 2030కి ప్రజలందరికీ అందేలా చూడటమే మన లక్ష్యమని మాజీ అదనపు సంచాలకుడు, సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డవలప్‌మెంట్ (ఐఎస్‌ఆర్డీ) అధికారి సరోజ్ దాస్ అన్నారు. ఈ సందర్భంగా సీసీడీ ద్వారా అడ్డాల జగన్నాథరాజు 15 మంది దివ్యాంగుల లబ్ధిదారులకు చిరు వ్యాపారం చేసుకోవడానికి రూ.20 వేలు చొప్పున్న కలెక్టర్, జిల్లా పరిషత్ అధ్యక్షుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పురపాలక చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప్ సప్తాహ్‌లో కుంటికోట ప్రొఫెసర్


పీఎం నరేంద్రమోదీ, అధికారులతో ప్రొఫెసర్ అనూరాధ

మందస: దేశంలోని వెనుకబడిన 112 జిల్లాల్లో కేంద్రం చేపట్టిన అభివృద్ధి పనులు ఎంతగానో మార్పు తీసుకువచ్చిందని ప్రభుత్వం చెబుతోంది. దీనిలో భాగంగా మరో 100 బ్లాక్‌లు ఎంపిక చేసి అభివృద్ధి చేసే కార్యక్రమం సంకల్ప్ సప్తాహ్ దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రారంభమైంది. నీతి ఆయోగ్, ఎన్‌ఐఆర్డీ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఇందులో మందస మండలం కుంటికోట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ పల్లా అనూరాధకు ప్రధానమంత్రితో పాల్గొనే అవకాశం కలిగింది. ఈమె హైదరాబాదులోని ఎన్‌ఐఆర్డీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నీతిఆయోగ్, ఎన్‌ఐఆర్డీ సంయుక్తంగా అధికారులకు శిక్షణ ఇచ్చారు. బెస్ట్ ట్రైనర్‌గా ఎంపికైన తనతో ప్రధాని మాట్లాడుతూ ట్రైనింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారని ప్రొఫెసర్ అనూరాధ 'సాక్షి'కి బుధవారం చెప్పారు.

సమష్టి కృషితోనే హోటల్స్ సమస్య పరిష్కారం

- రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి
- జిల్లా, నగర హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో హోటలర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి అవసరమని రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.వి.స్వామి, మెట్ట నాగరాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బుధవారం జిల్లా, నగర హోటలర్స్, రెస్టారెంట్, బేకర్స్, ఫంక్షన్ హాల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అర్ధరాత్రి వరకు హోటల్స్ నడుపుకొనే అవకాశం ఉండేదని, ఇప్పుడా సమయాన్ని తగ్గించటం, పన్నులు, ధరలు పెరిగిపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధికి దృష్టి సారించిన నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలసి హోటలర్స్ సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నో రంగాల వారికి న్యాయం చేస్తున్నారని హోటలర్స్‌కు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. హోటల్ రంగాన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల్లో(ఎంఎస్‌ఎంఈ) చేర్చాలని కోరారు. ఇలా చేయడం వల్ల మిగిలిన పరిశ్రమల తరహాలోనే ప్రభుత్వం నుంచి రాయితీలు వస్తాయని, బ్యాంకర్ల నుంచి సహకారం అందుతుందని చెప్పారు. విద్యుత్ చార్జీల్లో యూనిట్‌కు రూపాయి రాయితీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి ఎస్.హనుమంతరావు, కోశాధికారి పి.వి.పూర్ణచంద్రరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఈదర వెంకటపూర్ణచంద్ర, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి రఘువీర సేనై, 13 జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం..

శ్రీకాకుళం జిల్లా సంఘం అధ్యక్షుడిగా బస్వా శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సువ్వారి వెంకట సతీష్, ఉపాధ్యక్షులుగా గవరయ్య, ఉన్న వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా పి.బి.ఎస్ వర్మ, కోశాధికారిగా గొల్లపల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా పి.వెంకటేష్, తుమ్మగుండ శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, పీఆర్వోగా టంకాల కృష్ణలను ఎన్నుకున్నారు.

నగర కార్యవర్గం..

శ్రీకాకుళం నగర సంఘం అధ్యక్షునిగా అందవరపు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శిగా వి.సుదర్శన్, ఉపాధ్యక్షులుగా అరవల సతీష్‌కుమార్, టంకాల కృష్ణ, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా జి.నాగరాజు, కోశాధికారిగా కె.భవానీశంకర్, సంయుక్త కార్యదర్శిగా కె.గణపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాణ సతీష్, హర్ష, మణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేదల ఆరోగ్యమే ధ్యేయం

కాశీబుగ్గ: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, ఇందులో భాగంగానే ఇటీవల ఆరోగ్యశ్రీ పరిధిలో కొత్త వ్యాధులను చేర్చామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి స్వగృహంలో బుధవారం 13వ వార్డులో పోతనపల్లి వీధికి చెందిన జర్నలిస్ట్ బాడ నటరాజ్‌కు రూ.5లక్షల 40 వేల చెక్కు అందజేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని మరికొన్ని కేసులను గుర్తించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నటరాజ్ మాట్లాడుతూ తుంటి సమస్యతో 18 నెలలుగా మంచానికి పరిమితమయ్యానని, హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందని, ఇందుకు కృషి చేసిన మంత్రి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ లంబాల మధుసూదన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతి కుమారి, అంది రమాకృష్ణ, నల్లారి అశోక్‌కుమార్, నల్ల నారాయణ, గోరు భాస్కరరావు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు

- విద్యారంగ మార్పులతో ఉత్తమ మానవ వనరులు
- జాతీయ సదస్సులో ఎన్‌సీటీఈ సభ్యుడు ప్రొఫెసర్ గంటా రమేష్
- నూతన విద్యా విధానంపై అంబేడ్కర్ వర్సిటీలో రెండు రోజుల సదస్సు ప్రారంభం


మాట్లాడుతున్న ఎన్‌సీటీఈ సభ్యుడు ప్రొఫెసర్ గంటా రమేష్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యలో మార్పులతోనే ఉత్తమ మానవ వనరులు సాధ్యమని న్యూఢిల్లీకి చెందిన నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) సభ్యుడు ప్రొఫెసర్ గంటా రమేష్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో విద్యావిభాగం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ (ఐసీఎస్‌ఎస్‌ఆర్), యూనియన్ బ్యాంక్, సమగ్ర శిక్షల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ నూతన విద్యావిధానం -2020 అమలు, వ్యూహాలు, సవాళ్లు అనే అంశంపై రెండు రోజుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావిధానం, విద్యలో అంతర్జాతీయ మార్పులు అధ్యయనం చేశాకే నూతన విద్యావిధానం అమలు చేసినట్లు తెలిపారు. ఇందులో 5+3+3+4 విధానం అమలవుతుందని చెప్పారు. ఎర్లీఎడ్యుకేషన్, స్కూల్, హయర్, ప్రొఫెసనల్, ఒకేషనల్, టెక్నికల్, స్పెషల్ ఎడ్యుకేషన్‌లు అమలవుతాయని వివరించారు. విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, నిపుణులైన బోధన సిబ్బందిని నియమించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రయోగాలు, నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు.

- న్యూఢిల్లీకి చెందిన ఐసీఎస్‌ఎస్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, బోధన సిబ్బంది సమష్టిగా కృషిచేస్తేనే నూతన విద్యా విధానం అమలు సాధ్యమవుతుందన్నారు. మూడేళ్ల పాటు పరిశోధన, పరిశీలన అనంతరం ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. న్యాయస్థానాలు, పలు కమిటీలు సైతం గతంలో అనేక సిఫారసులు చేశాయని గుర్తు చేశారు.
- జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ మాట్లాడుతూ నూతన విద్యావిధానం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జాతీయ విద్యా హక్కు చట్టం సైతం పటిష్టంగా అమలవుతుందని చెప్పారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.
- అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ వర్సిటీలో నూతన విద్యావిధానం అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల డిగ్రీ బీఏ+బీఎడ్, బీఎస్సీ+బీఎడ్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కొత్త వర్సిటీ అయినప్పటికీ పరిశ్రమల అనుసంధానంతో ఉపాధి లక్ష్యంగా విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు.
- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యావిధానం కరిక్యులమ్ పక్కాగా అమలు చేయడమే లక్ష్యమని చెప్పారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను ఈ విద్యావిధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యారంగ నిపుణులు ప్రొఫెసర్ పద్మనాభయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.వెంకట్‌తిలక్ , ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం, సహాయ కన్వీనర్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారాతో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో రూరల్ పోలీసు సిబ్బంది

పార్వతీపురం టౌన్: సారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్టు పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ సింహాచలం బుధవారం తెలిపారు. మండలంలోని ఆర్కే బట్టివలస గ్రామ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం ప్రాంతానికి సారా రవాణా చేస్తున్న సిరిపురపు అఖిల్, బంగారు కృష్ణలను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి నుంచి 320 లీటర్ల సారా, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు. రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న వ్యక్తితో ఎస్‌ఐ

గరుగుబిల్లి: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని బురద వెంకటాపురానికి చెందిన కేతిరెడ్డి తిరుపతినాయుడు వద్ద ఉన్న 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు బుధవారం గుర్తించారు. ప్రమాదవశాత్తు జారిపడి మరణించి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో తెలిపారు. మృతునికి 60 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, శరీరంపై నలుపు రంగు నిక్కరు, తెలుపు రంగుపై నీలం రంగు గడుల చొక్కా ధరించాడు. తెలుపు రంగు గెడ్డం ఆనవాళ్లుగా గుర్తించారు. ఎస్‌ఐ రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి



మృతి చెందిన దమరసింగి రాము

గుర్ల: మండల కేంద్రంలోని బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గరివిడి మండలంలోని గెడ్డపువలస గ్రామానికి చెందిన దమరసింగి రాము(58) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాము గరివిడి నుంచి విజయనగరం నడుచుకొని వెళ్తుండగా గుర్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడు గరివిడి మండలం గెడ్డపువలస వీఆర్‌ఏగా పని చేస్తున్నాడు. గుర్తు తెలియని వాహనం గురించి విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ హరిబాబు నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసారు.

ట్రాక్టర్ ప్రమాదంలో కూలి మృతి



మృతి చెందిన రమణ

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస ఇటుకల బట్టి వద్ద మంగళవారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వల్లింకల రమణ(40) మరణించాడు. ఎస్‌ఐ ఫకృద్దీన్ బుధవారం తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వల్లింకల రాము ఇటుక బట్టి వద్దకు కూలి పని కోసం మంగళవారం వెళ్లాడు. అక్కడ ఎత్తుగా ఉండే ప్రాంతంపైకి అదే గ్రామానికి చెందిన డ్రైవర్ బుడ్డిపు శంకరరావు ట్రాక్టర్ ఎక్కిస్తుండగా, ట్రాక్టర్‌ను వెనుక నుంచి తోస్తున్న రమణ మీదకు ట్రాక్టర్ అదుపు తప్పి వెనక్కి వచ్చి తగిలింది. ఈ ప్రమాదంలో రమణ మరణించాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్‌ఐ అన్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

కోటదుర్గమ్మకు పూజలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతికరమైన బుధవారం పల్లెల్లో వారాలు చేపడుతున్న భక్తులు గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించి, దుర్గమ్మకు సంప్రదాయ పూజలు జరిపారు. అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ నేతృత్వంలో ఉత్సవమూర్తికి విశేష పూజలు నిర్వహించారు.

ఓపీ సేవలు సులభతరం

- అభా యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- రోజుకు ఓపీకి వచ్చే రోగులు 1000 నుంచి 1500 మంది
- అందులో అభా యాప్ ద్వారా ఓపీ చీటీలు పొందుతున్న వారు 600 మంది
- నిరీక్షణకు తెర



ఓపీ చీటి కోసం స్కాన్ చేస్తున్న వ్యక్తి

విజయనగరం ఫోర్ట్: ఎవరైనా వ్యక్తికి ఏదైనా జబ్బు చేస్తే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలంటే ముందుగా ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో ఓపీ చీటి తీసుకోవాలి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో రోగులు తక్కువగా ఉంటారు కాబట్టి ఓపీ చీటీ తీసుకోవడం తక్కువ సమయంలో అయిపోతుంది. అదే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అయితే అధిక సంఖ్యలో రోగులు వస్తారు కాబట్టి ఈ చీటీ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అభా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ ద్వారా సులభంగా ఓపీ చీటీని పొందవచ్చు. క్యూలో ఎక్కువ సమయం నిరీక్షించాల్సిన అవసరం ఉండదు.

అభా యాప్ డౌన్‌లోడు చేసుకోవాలి

అభా యాప్‌ను స్మార్ట్ ఫోన్ ద్వారా ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో ఫోన్ నంబరు ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. తర్వాత ఓపీ విభాగంలో ఏర్పాటు చేసిన స్కాన్ చేస్తే షేర్ చేయండి అని వస్తుంది. షేర్ చేస్తే వెంటనే టోకెన్ నంబరు వస్తుంది. టోకెన్ నంబరు ఓపీ విభాగంలో చెబితే వెంటనే ఓపీ చీటీ ఇస్తారు.

రోజుకు 1000 నుంచి 1500 మంది రోగులు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వివిధ వ్యాధులతో బాధపడే వారు అధిక సంఖ్యలో ప్రతి రోజు వస్తారు. ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, చర్మ, ఈఎన్‌టీ, డెంటల్, కంటి, ఎన్‌సీడీ, పలమనాలజీ, ఆర్థో, ఓపీ విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాల్లో చికిత్స కోసం రోజుకు 1000 నుంచి 1500 మంది రోగులు వస్తారు. వీరిలో 500 నుంచి 600 మంది వరకు అభా యాప్ ద్వారా ఓపీ పొందుతున్నారు. అభా యాప్ రాక ముందు ఓపీ చీటీలు కోసం రోగులు గంటల తరబడి లైన్‌లో ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి తప్పింది.

అభా యాప్‌పై అవగాహన

ఓపీ చీటీ కోసం వచ్చే వారికి వైద్య సిబ్బంది అభా యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ఉండి యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేని వారికి వైద్య సిబ్బంది యాప్ ఏ విధంగా డౌన్‌లోడ్ చేసుకోవాలి, చీటీ ఏవిధంగా పొందాలి అనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.



అభా యాప్ గురించి వివరిస్తున్న వైద్య సిబ్బంది

మంచి స్పందన

అభా యాప్‌ను ఎక్కువ మంది రోగులు వినియోగించుకుంటున్నారు. యాప్ గురించి తెలియని వారికి మా సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. రోజుకు 600 మంది వరకు అభా యాప్ ద్వారా ఓపీ చీటీలు పొందుతున్నారు. రెండోసారి ఓపీ పొందాలనుకునే వారు నేరుగా స్కాన్ చేసి ఓపీ పొందవచ్చు.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్

తప్పుడు దరఖాస్తులపై అప్రమత్తంగా ఉండాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో డీఆర్‌ఓ అనిత

విజయనగరం అర్బన్: ఓటు నమోదు, తొలగింపు ప్రక్రియలో భాగంగా కొంతమంది తప్పుడు దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉందని అలాంటి వాటిపై అధికారులు, కింది స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె పలు అంశాలపై సమీక్షించారు. రాజకీయ లేదా వ్యక్తిగత కారణాలతో కొంతమంది ఉద్దేశపూర్వకంగా వేరే వ్యక్తుల ఓట్లను తొలగించాలని దరఖాస్తులు సమర్పిస్తున్న సంఘటనలు ఇటీవల ఒక జిల్లాలో చోటు చేసుకున్నాయని గుర్తుచేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటివి విజయనగరం జిల్లాలో చోటు చేసుకోకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫారం-7 దరఖాస్తులను ఒకటికి రెండుసార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు తెలితే కఠినమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన సంబంధిత లేఖ సారాంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అధికారులకు వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించి కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికారులు భాగస్వామ్యం కావాలని చెప్పారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీల నుంచి సహకారం అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, విజయనగరం ఆర్డీఓ ఎం.సూర్యకళ, ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరావు, సుదర్శన దొర, పద్మలత, నూకరాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చేపలు, రొయ్యల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ మురళి



మాట్లాడుతున్న నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.మురళి

తెర్లాం: మత్స్యకారులంతా చేపలు, రొయ్యల సాగు(పెంపకం)లో మంచి యాజమాన్య పద్ధతులను పాటించాలని నాక్సా (నేషనల్ సెంటర్ ఫర్ సస్టైన్‌బుల్ ఆక్వాకల్చర్) ఉత్తరాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.మురళి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నాక్సా శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ మేనేజర్ పి.రాము ఆధ్వర్యంలో 'మంచి యాజమాన్య పద్ధతులు, విభిన్న జాతుల పెంపకం'పై మత్స్యకారులకు ఇవ్వనున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని తెర్లాం సర్పంచ్ బోనెల రూప జ్యోతి ప్రజ్వలన చేసి బుధవారం ప్రారంభించారు. శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ మాట్లాడుతూ మత్స్యకారులంతా మేలైన, విభిన్న జాతులకు చెందిన చేపలు, రొయ్యలు సాగు చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. మోప్మా, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మత్స్యకారుల సంఘాలను ఏర్పాటు చేసి, వారితో చేపలు, రొయ్యల పెంపకానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా ఆక్వా రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందని ఆయన చెప్పారు. నాక్సా శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ మేనేజర్ పి.రాము మాట్లాడుతూ ఎస్టీ కులాలకు సంబంధించిన మత్స్యకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెర్లాం సర్పంచ్ బోనెల రూప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాక్సా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను మత్స్యకారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బొబ్బిలి మత్స్యశాఖ అధికారి సీహెచ్ సంతోషి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, సభ్యులు వెంకటరమణ, సీతయ్య, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన కావ్య ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవా దృక్పథంతో సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, టీడీపీ నాయకులు అశోక్‌గజపతిరాజు, కర్రోతు బంగారురాజు, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మోపాడ, డాక్టర్ చంద్రకళ కర్రోతు తదితరులు పాల్గొన్నారు.

6న ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారిని అరుణ

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహిళా ప్రాంగణం దరిలోని ఐటీఐలో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఆర్గనైజేన్, గాయత్రి ఆస్పత్రి, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ కంపెనీల్లో వివిధ కేడర్లలో 106 ఉద్యోగాల నియామక ప్రక్రియ ఆయా సంస్థల ప్రతినిధులు చేపడతారని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఆర్గనైజేషన్‌లో బిజినెస్ డవలప్మెంట్ మేనేజర్ 10 (పర్మినెంట్) పోస్టులకు రూ.22 వేల నుంచి రూ.35 వేల వేతనం ఉంటుందని ఈ పోస్టులకు 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయసుతో ఏదైనా డిగ్రీ విద్యార్హత ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. ఆ ఫైనాన్స్ కన్సల్టెంట్ 50 (టెంపరరీ) పోస్టులకు రూ.15 నుంచి రూ.40 వేల వరకు గౌరవ వేతనం ఉంటుందని, ఈ పోస్టులకు 60 సంవత్సరాలలోపు వయసుతో పదో తరగతి విద్యార్హత ఉండాలని తెలిపారు. గాయత్రి ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సు 11 పోస్టులకు రూ.8,500 నుంచి రూ.10 వేల వేతనం ఉంటుందని ఈ పోస్టులకు 18 నుంచి 27 సంవత్సరాల వయసులోపు ఉన్న ఏఎన్ఎం/జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత ఉన్న స్త్రీలు మాత్రమే అర్హులను తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో బ్యాంక్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 35 పోస్టులకు రూ.14,500 వేతనం ఉంటుందని, ఈ పోస్టులకు 35 సంవత్సరాలలోపు వయసున్న ఇంటర్/ఏదైనా డిగ్రీ విద్యార్హత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 'ఎన్‌సీఎస్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్ లాగిన్ చేసుకోవాలని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రాంగణానికి తమ బయోడేటాను, రెండు పాస్‌ఫోటోలతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

జెడ్పీ చైర్మన్‌కు అభినందనలు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును అభినందిస్తున్న శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ఏపీ శిష్ట కరణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కంఠిమహంతి అనూష పట్నాయక్ బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

జెడ్పీ చైర్మన్‌గా రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ కె.చంద్రమౌళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జయితి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డొంకాడ అనీల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూటపల్లి గోవింద, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



కర్నూలులో జరగబోయే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

- ఈ నెల 29 నుంచి కర్నూలులో రాష్ట్ర స్థాయి పోటీలు

విజయనగరం:

రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్ – 19 బాల, బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం పూర్తయ్యాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో జిల్లా అండర్ – 19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 19 సంవత్సరాల్లోపు వయస్సు గల ఇంటర్మీడియెట్ విద్యనభ్యసిస్తున్న 400మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరు కాగా... అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది బాలురును, 16 మంది బాలికలను తుది జట్టులోకి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరగబోయే అంతర్ జిల్లాల బాల, బాలికల హ్యాండ్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లిబాబు, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

6, 7 తేదీల్లో ఖోఖో, కబడ్డీ జట్ల ఎంపికలు

అండర్ – 19 స్కూల్ గేమ్స్ ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. ఆయా రోజుల్లో 10 గంటలకు జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృత్యు తీగలు

- యువకుడిని బలిగొన్న విద్యుత్ తీగలు
- చెట్టు కొమ్మలు కోస్తూ విద్యుత్ షాక్‌కు గురి



కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) ఆలుబిల్లి కుమార్(ఫైల్)

వీరఘట్టం: పొలంలో కలగొప్పులు విత్తనాలు చల్లి అర గంటలో వచ్చేస్తానని చెప్పిన కొడుకు అంతలోనే మృత్యు ఒడికి చేరుకున్నాడు. విషయం తెలిసి తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. గుండెలవిసేలా రోదిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వీరఘట్టం సాయినగర్ కాలనీకి చెందిన ఆలుబిల్లి మజ్జేశ్వరరావు, సూరీడమ్మ దంపతుల రెండో కుమారుడు ఆలుబిల్లి కుమార్(20) పాలకొండలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లే ముందు తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూ చదువు సాగిస్తూ ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. ఖరీఫ్ సీజన్‌లో మంగళవారం తరువాత బుధవారం కలగొప్పులు జరపడం ఇక్కడ ఆనవాయితీ. ఇంటిలో వండిన వేడి అన్నం తమ పొలంలో చల్లుతారు. ఇందుకు ఆకులు కావాల్సి ఉండడంతో తమ పొలానికి సమీపంలో ఉన్న ఓ టేకు చెట్టును కుమార్ ఎక్కుతూ ఓ కొమ్మను కొడవలితో కొట్టాడు. పక్కనే ఉన్న పాలకొండ – వీరఘట్టం 33/11 కేవీ విద్యుత్ లైన్‌పై కొమ్మ పడింది. దీన్ని గమనించని కుమార్ తాను నరికిన టేకు కొమ్మను తన ఎడమ చేతితో పట్టుకుని లాగేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆ తీగలకు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. ఎస్‌ఐ ఎంవీ రమణ కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు నమోదు చేశారు. కుమార్ మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తరువాత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పసిడితల్లి పండగకు పందిరిరాట

- ముహూర్తం ప్రకారం వనంగుడి, చదురుగుడి ఆవరణలో పందిరిరాట ఉత్సవం
- పైడిమాంబ దీక్షలు చేపట్టిన దీక్షాపరులు



పందిరిరాట ఉత్సవంలో ఆలయ సిబ్బంది, భక్తులు, ప్రజాప్రతినిధులు

విజయనగరం టౌన్: చిన్నారి పసిడితల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు బుధవారం పందిరిరాట మహోత్సవంతో అంకురార్పణ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాలతో అమ్మవారికి నివేదన చేశారు. ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 8 గంటలకు ఆలయ ఆవరణలో పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో సుమారు వంద మందికి పైగా భక్తులు అమ్మవారి దీక్షలు చేపట్టారు. వారికి ఆలయ ఈఓ అమ్మవారి వస్త్రాలను, మాలలను ఉచితంగా అందజేశారు. అనంతరం మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో ఉదయం 9.30 గంటలకు వేదపండితులు శాస్త్రోక్తంగా పందిరిరాట మహోత్సవాన్ని జరిపారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మితో పాటు వార్డు కార్పొరేటర్లు, స్థానిక పెద్దలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో మేళతాళాలతో అమ్మవారి పందిరిరాట వేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది సమష్టికృషితో అమ్మ జాతరను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. త్వరలోనే అమ్మవారు సిరిమాను ఎక్కడ వెలిసిందీ అన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ అధికారులు, పెద్దలు పాల్గొన్నారు.

అంతలోనే...ఏమైంది!

- అప్పటి వరకు స్నేహితులతో మాట్లాడి..
- ఢిల్లీలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- – విమానంలో చీపురుపల్లికి మృతదేహం
- విషాదంలో కుటుంబ సభ్యులు



ఆత్మహత్యకు పాల్పడిన సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ దాసరి నాగేశ్వరరావు, (ఇన్‌సెట్‌లో) దాసరి నాగేశ్వరరావు(ఫైల్)

చీపురుపల్లి: 'ఏం కష్టం వచ్చిందో ఏమో.. కనీసం ఎవరితో చెప్పుకోలేదు.. అటు స్నేహితులకుగాని ఇటు కుటుంబ సభ్యులకుగానీ ఎవరికీ తెలియదు.... అర్ధరాత్రి వరకు స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడాడు. అంతలోనే ఏమైందో తెలియదుగానీ లోకాన్ని విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు.. తన గదిలో ఉరి వేసుకుని సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు.' అధికారులు ద్వారా విషయం తెలుసుకున్న భార్య, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పట్టణంలోని రుంకానవీధికి చెందిన సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ దాసరి నాగేశ్వరరావు ఢిల్లీలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలచివేసింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, బంధువులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు నాగేశ్వరరావు ఢిల్లీలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఢిల్లీలోని తన క్వార్టర్స్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2017లో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన నాగేశ్వరరావుకు రేణుకతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. మూడేళ్ల పాప ఉండగా, భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉన్నారు. నెల రోజుల సెలవు కోసం ఇటీవల కుటుంబంతో చీపురుపల్లి వచ్చాడు. సెలవులు పూర్తవ్వడంతో వారం క్రితమే నాగేశ్వరరావు భార్య, పాపను చీపురుపల్లిలోనే ఉంచి విధులకు ఢిల్లీ వెళ్లాడు. త్వరలో పాప పుట్టినరోజు ఉండడంతో భార్య, కుమార్తెను చీపురుపల్లిలో ఉంచి, ఆ సమయానికి తిరిగి రావాలనుకునే విధులకు వెళ్లాడు. కానీ ఏం జరిగిందో తెలియదుగానీ ఆత్మహత్య నిర్ణయం తీసుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం ఉదయం విధుల్లోకి రాకపోవడంతో అక్కడి అధికారులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మృతుడు అన్నయ్య మన్మథరావు, స్థానిక ఎంపీటీసీ ముల్లు పైడిరాజు ఢిల్లీ వెళ్లారు. అక్కడ నుంచి మృతదేహాన్ని విమానంలో చీపురుపల్లి తీసుకొస్తున్నారు. గురువారం చీపురుపల్లిలో కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు జరగనున్నాయని ముల్లు పైడిరాజు తెలిపారు.